GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in
# టి-మీడియా
సామాజికం... ప్రజల పక్షం
మెయిన్ : శనివారం- నవంబర్ 11-2023 పేజీలు : 2

## మీ ప్రేమ నన్ను ముగ్ధుడ్ని చేసింది : మహేశ్ బాబు

**టీ మీడియా, నవంబర్ 10, విజయవాడ :**

గురునానక్ కాలనీలో సూపర్ స్టార్ కృష్ణ విగ్రహాన్ని శుక్రవారం ఉదయం ప్రముఖ నటుడు కమల్ హాసన్, వైసిపి నేత దేవినేని అవినాష్ ఆవిష్కరించిన సంగతి విదితమే. దీనిపై టాలీవుడ్ సూపర్ స్టార్, కృష్ణ కుమారుడు మహేశ్ బాబు స్పందించారు. – " విజయవాడలో కృష్ణ గారి విగ్రహం ఆవిష్కరించడం పట్ల కమలహాసన్ సర్ కు, దేవినేని అవినాశ్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. వారు నాన్న గారి విగ్రహాన్ని ఆవిష్కరించడం నిజమైన గౌరవంగా భావిస్తున్నాను. నాన్న గారు వదిలి వెళ్లిన ఘనమైన చరిత్రకు ఇది నివాళి వంటిది. ఈ విగ్రహావిష్కరణకు తోడ్పాటు అందించిన అభిమానులందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. మీ ప్రేమ నన్ను ముగ్ధుడ్ని చేసింది " అని పేర్కొన్నారు.

## గాజాని పరిపాలించాలను కోవడం లేదు : నెతన్యాహూ

**టీ మీడియా, నవంబర్ 10, జెరూసలెం :**

పాలస్తీనా భూభాగమైన గాజాని పరిపాలించాలని కోరుకోవడం లేదని ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ పేర్కొన్నారు. ఇజ్రాయిల్ సైన్యం అనూహ్యమైన పనితీరు కనబరుస్తోందని భావిస్తున్నానని, అయితే గాజాను తిరిగి ఆక్రమించాలనే ఉద్దేశం లేదని అన్నారు. జాతీయ మీడియాతో మాట్లాడారు. కాల్పుల విరమణ వార్తలను తోసిపుచ్చారు. హమాస్‌పై కాల్పుల విరమణ అంటే వారికి లొంగిపోవడమేనని స్పష్టం చేశారు. సైనిక దాడికి టైమ్ లిమిట్ అంటూ ఉండదని అన్నారు. యుద్ధం దీర్ఘకాలమైనా కొనసాగిస్తామని చెప్పారు. గాజా భూభాగాన్ని పరిపాలించాలని తాను భావించడం లేదని, ఆక్రమించాలనుకోవడం లేదని, కానీ గాజాకు మెరుగైన భవిష్యత్తు ఇవ్వాలని ఆశిస్తున్నానని అన్నారు. గాజా నుండి ఎవరినీ వెళ్లగొట్టాలని అనుకోవడం లేదని అన్నారు. పేదరికంలో ఉన్న మరియు దిగ్బంధంలో ఉన్న భూభాగం నుండి సైన్యాన్ని ఉపసంహరించాలని, ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని, తిరిగి పునర్మించాలని భావిస్తున్నట్లు తెలిపారు. గాజాలో పౌర ప్రభుత్వాన్ని నియమించాలని అయితే ఆ ప్రభుత్వాన్ని ఎవరు నియమిస్తారన్న అంశాన్ని దాటవేశారు. గాజాలో హమాస్ వంటి ఉగ్రవాద సంస్థలు తిరిగి రాకుండా నిలువరిస్తామని అన్నారు.

## కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించిన విశ్వనటుడు కమల్

**టీ మీడియా, నవంబర్ 10, విజయవాడ :**

ప్రముఖ సినీ నటుడు, సూపర్ స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ కార్యక్రమం శుక్రవారం విజయవాడలో అట్టహాసంగా నిర్వహించారు. గురునానక్ కాలనీలోని కెడిజిఒ పార్కులో ఏర్పాటుచేసిన విగ్రహాన్ని విశ్వనటుడు, పద్మభూషణ్ కమల్‌హాసన్ ఆవిష్కరించారు. ఇండియన్-2 చిత్ర నిర్మాణం కోసం కమల్‌హాసన్ విజయవాడ వచ్చారు. దీనిలో భాగంగా కృష్ణ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దేవినేని అవినాష్, కృష్ణ అభిమానులు పాల్గన్నారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. తెలుగు ఇండిస్ట్రీలో తనదైన ముద్ర వేసిన నటుడు కృష్ణ అని అన్నారు. అయన వారసత్వంతో ఇండిస్ట్రీలోకి వచ్చిన మహేష్‌బాబు అటు సినీరంగంలోనూ, ఇటు సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటూ కృష్ణ పేరు నిలబెడుతున్నారని తెలిపారు. షూటింగ్‌లో బిజీగా ఉండే కమల్‌హాసన్ ఇక్కడకు రావడం సంతోషంగా ఉందన్నారు. పదిరోజుల వ్యవధిలోనే కఅష్ణ విగ్రహం ఏర్పాటుకు సహకరించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృష్ణ కుటుంబ సభ్యుల తరపున ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఎన్నికల రణరంగంలో యువ నారీమణులు

### ఫైట్ మామూలుగా లేదు

**టీ మీడియా, నవంబర్ 9, ఉమ్మడి వరంగల్ :**

అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఆ జిల్లాలో రాజకీయ ఉద్దండులపై ఇప్పుడిప్పుడే రాజకీయ ఓనమాలు నేర్చుకుంటున్న ఇద్దరు నారీమణులు సమరానికి సిద్ధమయ్యారు. గెలుపు ధీమాను వ్యక్తం చేస్తున్న ఆ మహిళ నేతలు జనంలో చర్చగా మారారు. ఇంతకీ ఎవరా నారీమణులు..? అంతటి రాజకీయ చరిత్ర కలిగిన ఉద్దండులు ఎవరు..? విషయం తెలియాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే..!ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇద్దరు నారీమణులు హాట్ టాపిక్ అయ్యారు. వారిలో ఒకరు ములుగు నుండి పోటీ చేస్తున్న అభ్యర్థి బడే నాగజ్యోతి కాగా, మరొకరు పాలకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న హనుమాండ్ల యశస్విని రెడ్డి. వీరద్దరు కూడా తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగుతుండటం విశేషం.నాలుగు దశాబ్దాల రాజకీయ చరిత్రలో ఓటమి ఎరుగని నేత, ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రి ఒకసారి ఎంపీగా, వరుసగా గెలిచి వరంగల్ ఉమ్మడి జిల్లా రాజకీయ ముఖచిత్రంలోనే ప్రత్యేక ముద్ర వేసుకున్న నేత ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావుపై ఒకసారి పోటీచేసిన వారు రెండోసారి పోటీ చేసిన చరిత్ర లేదు. రెండోసారి ఆ ప్రత్యర్థులు వేరొక నియోజకవర్గాన్ని వెతుక్కోవాల్సిందే..! లేదంటే పోటీ నుండి విరమణ పొందాల్సిందే..! అంతటి రాజకీయ చరిత్ర కలిగిన ప్రజ్ఞాశాలి ఎర్రబెల్లి దయాకర్ రావు. ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలలో బాహుబలిగా ప్రత్యేక ముద్ర వేసుకున్న ఎర్రబెల్లిపై పోటీ చేయడమంటే సాహసమే. అలాంటి రాజకీయ ఉద్దండుడి పై 26 ఏళ్ల యువ నాయకురాలు పోటీకి సిద్ధపడింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా యశస్విని రెడ్డి బరిలోకి దిగుతోంది.మొదట ఎన్నారై ఝాన్సీరెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున పాలకుర్తి నుండి బరిలోకి దిగుతుందని భావించినప్పటికీ, భారతదేశ ప్రభుత్వం ఆమెకు పౌరసత్వం నిరాకరించింది. ఈ క్రమంలో ఆమె కోడలు యశస్విని రెడ్డిని బరిలోకి దింపారు. ఏ మాత్రం రాజకీయ అనుభవం లేని ఆ యువ నాయకురాలిని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పాలకుర్తి నుండి పోటీకి పెట్టింది. ఇంతటి రాజకీయ ఉద్దండుడిని ఎదురుకోవడం యశస్విని రెడ్డికి పెద్ద సవాల్‌గా మారింది. చిన్న వయస్సులో సాహసానికి పూనుకున్న యశస్విని రెడ్డి, చివరి వరకు నిలబడుతుందా లేదా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

మరోవైపు వరంగల్ ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుండి మహిళా ఫైర్ బ్రాండ్‌గా ప్రత్యేక ముద్ర వేసుకున్న నేత సీతక్క అలియాస్ అనసూయ. ములుగు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సీతక్కపై బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా బడే నాగజ్యోతిని కేసీఆర్ బరిలోకి దింపారు. 29 ఏళ్ల వయసు కలిగిన నాగజ్యోతి తన జీవితంలో మొట్ట మొదటిసారి శాసనసభ ఎన్నికలకు పోటీ చేస్తుంది. ములుగు నియోజక వర్గంలో ప్రత్యేక ముద్ర వేసుకున్న సీతక్కపై నాగజ్యోతి పోటీ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. నాగజ్యోతి గెలుస్తుందా..? సీతక్క హ్యాట్రిక్ విక్టరీ సాధిస్తుందా..? అనే చర్చ కొనసాగుతుంది.బడే నాగజ్యోతి వయసులో చిన్నదయినప్పటికీ కేసీఆర్ రాజకీయ వ్యూహంతోనే ఆమెను బరిలోకి దింపారు.. కాంగ్రెస్ అభ్యర్థి సీతక్కది %దీ=నా% అభ్యర్థి నాగజ్యోతి ది దాదాపుగా ఒకే నేపథ్యం. ఓకే సామాజిక వర్గం. ఇద్దరిదీ ఉద్యమ చరిత్రే.

సీతక్క ప్రత్యక్షంగా బందూకు పట్టి నక్సలైట్ ఉద్యమం నుండి జనజీవన స్రవంతిలోకి అడుగుపెట్టి ప్రజాప్రతినిధిగా ఎదిగారు. %దీ=నా% అభ్యర్థి బడే నాగజ్యోతి తల్లిదండ్రులు ఇద్దరు అదే అజ్ఞాత జీవితంలో అసువులుబాశారు. ఈ నేపథ్యంలోనే తన తండ్రి పోరాట చరిత్రను ఎన్నికల అస్త్రంగా మలుచుకుని ప్రచారం నిర్వహిస్తున్నారు. 29 ఏళ్ల యువ నాయకురాలు సీతక్కను ఎదుర్కోగలుగుతుందా.? లేదా అనే చర్చ మొదలైంది. చూడాలి మరీ ఎన్నికల్లో ఓటర్లు ఎవరికి పట్టం కడతారో..!

## కామారెడ్డిలో నామినేషన్ వేసిన రేవంత్ రెడ్డి

**టీ మీడియా, నవంబర్ 10, కామారెడ్డి :**

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. కేసీఆర్ పూర్వీకుల గ్రామమైన కొనాపూర్‌కు చెందిన ప్రజలు కొంత డబ్బులను విరాళాల రూపంలో సేకరించి రేవంత్ రెడ్డికి అందించారు. ఈ డబ్బును రేవంత్ రెడ్డి నామినేషన్ పత్రాలు సమర్పించేందుకు వినియోగించారు. కాగా, ప్రత్యేక హెలికాప్టర్‌లో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో కలిసి హైదరాబాద్ నుంచి రేవంత్ కామారెడ్డికి చేరుకున్నారు. ఆ తర్వాత భారీర్యాలీతో వెళ్లిన రేవంత్ రెడ్డి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సిద్ధరామయ్య, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాయణ, ఆ పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, తెలంగాణ జన సమితి చీఫ్ కోదండరాం, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, కర్ణాటక మంత్రి బోస్ రాజు తదితరులు ఉన్నారు. ఇది ఇలా ఉంటే రేవంత్ రెడ్డి ఈ నెల 6న తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో నామినేషన్ దాఖలు చేశారు. కాగా, గతంలో కామారెడ్డి అసెంబ్లీ స్థానం నుంచి షబ్బీర్ అలీ ప్రాతినిధ్యం వహించారు. ఇప్పటి వరకు కామారెడ్డి నుంచి పోటీచేసిన షబ్బీర్ అలీ ఈసారి నిజామాబాద్ అర్బన్ నుంచి బరిలోకి దిగుతున్నారు..

## సీఎం జగన్ కాన్వాయ్ లో స్వల్ప ప్రమాదం

**టీ మీడియా, నవంబర్ 10, ఇడుపులపాయ:**

వైఎస్ఆర్ జిల్లా పర్యటనలో ఉన్న సీఎం జగన్ కాన్వాయ్ లో స్వల్ప ప్రమాదం జరిగింది. సీఎం వాహనాన్ని ఆయన కాన్వాయ్ లోని మరో వాహనం ఢకొొట్టింది. దీంతో సీఎం జగన్ వాహనం దిగి వేరే వాహనంలో ఇడుపులపాయ ఎస్టేట్‌కు వెళ్లారు. కాన్వాయ్ లోని సీఎం వాహనం ముందున్న వాహనం వేగం తగ్గడంతో ఈ ప్రమాదం జరిగింది. వేముల మండల వైసిపి నేతలతో సమీక్ష అనంతరం ఇడుపులపాయ ఎస్టేట్‌కు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ తర్వాత ఇడుపులపాయ నుంచి హెలికాప్టర్‌లో కడపకు సీఎం బయల్దేరి వెళ్లారు. అక్కడి నుంచి ఆయన విజయవాడ రానున్నారు.

## గ్యాస్ బండ ధరకు హడలు..

- **కట్టెల పొయ్యే బెటరు**

**టీ మీడియా, నవంబర్ 10, న్యూఢిల్లీ ::**

ఇప్పటికే నిత్యావసరాల ధరలను అందుకోలేక కుదేలవుతోన్న సామాన్యుల నెత్తిపై మరో 'గ్యాస్'బండ పడింది. డొమెస్టిక్, కమర్షియల్ గ్యాస్ ధరలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు అమాంతం పెంచేశాయి. నవంబర్ 1 నుండి గ్యాస్ సిలిండర్ ధరలను భారీగా పెంచుతున్నట్లు చమురు మార్కెటింగ్ కంపెనీలు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో ... పేదవారి చూపులు కట్టెల పొయ్యి వైపే చూస్తున్నాయి..కట్టెలతో వంట చేసే గ్రామాల్లో సైతం వంట గ్యాస్ వచ్చేసింది.. కానీ ఇప్పుడు పెరిగిన గ్యాస్ ధరల దెబ్బకు మళ్లీ ఆ గ్రామాలన్నీ కట్టెల పొయ్యిల వైపే మొగ్గు చూపుతున్నాయి. పెరిగిన నిత్యావసర ధరలను తట్టుకోలేక ఇప్పటికే పేదవారు చతికిలపడిపోతున్నారు. ఇప్పుడు వంటింటి గ్యాస్ ధరలు కూడా పెరగడంతో ... వారు కట్టెల పొయ్యే మంచిదంటూ.. మళ్లీ కట్టెల బాటపడుతున్నారు. ప్రకాశం జిల్లా హనుమంతునిపాడు మండల కేంద్రంలోని పేద మహిళలంతా కట్టెలు కొట్టుకొని నెత్తిన పెట్టుకొచ్చు కుంటున్నారు. కారణమేంటని అడిగితే... గ్యాస్ బండ ధరలను మోసే శక్తి లేక కట్టెలను మోసుకుంటున్నామని బదులిచ్చారు..! పెంచిన గ్యాస్ బండ ధర భరించలేని పేద మహిళలు పొలంకు వెళ్లి వంట చెరుకు కట్టెలు తెచ్చుకుంటున్న దృశ్యం హనుమంతునిపాడు మండల కేంద్రంలోని పేదల దుస్థితిని తెలియజేస్తుంది.

**పెంచిన రేట్లు...** 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధరను ఏకంగా రూ. 101.50 పెంచుతున్నట్లు చమురు మార్కెటింగ్ కంపెనీలు ప్రకటించాయి. ఈ కొత్త గ్యాస్ సిలిండర్ రేట్లు నవంబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయని సదరు చమురు మార్కెటింగ్ కంపెనీలు తెలిపాయి. ధరల పెరుగుదల అనంతరం ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీలో వాణిజ్య సిలిండర్ ధర రూ. 1833 గా ఉంది. అలాగే కోల్ కత్తాలో 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధర రూ. 1943 గాను, ముంబై లో రూ. 1785 గాను, అదే బెంగళూరులో రూ. 1914.50 గాను, ఇక చెన్నైలో రూ. 1999.50 గా ఉంది. ఇక మన తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే, హైదరాబాద్ లో 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధర రూ. 2059.50 గాను, అలాగే విజయవాడలో 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధర రూ. 1991.50గా ఉంది.

## అత్యంత ధనిక ఎమ్మెల్యే అభ్యర్థులు

- **రాజగోపాల్ రెడ్డి ఆస్తులు రూ. 458కోట్లు**

**టీ మీడియా, నవంబర్ 9, హైదరాబాద్ :**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి రూ. 458 కోట్ల ఆస్తులతో అత్యంత ధనవంతుడుగా రికార్డుల్లోకి కెక్కారు. మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్‌లో భాగంగా ఆయన తన ఆస్తుల వివరాలను అఫిడవిట్ రూపంలో జత చేశారు. ఈ అఫిడవిట్ ప్రకారం కోమటిరెడ్డి ఆస్తుల విలువ రూ.458.37 కోట్లుగా తేలిందిరాజగోపాల్ రెడ్డి మొత్తం ఆస్తుల్లో రూ.297.36 కోట్ల చరాస్తులు ఉన్నాయి. వీటిలో చేతిలో నగదు, బ్యాంకు డిపాజిట్లు, సుషీ ఇన్‌ఫ్రా %ఉ% మైనింగ్ లిమిటెడ్‌లో రూ.239.31 కోట్ల విలువ కలిగిన షేర్లు ఉన్నాయి. ఆయన భార్య కె.లక్ష్మికి రూ.4.18 కోట్ల చరాస్తులు ఉన్నాయి. రాజ్‌గోపాల్‌రెడ్డికి రూ.108.23 కోట్ల స్థిరాస్తులు ఉండగా, ఆయన భార్యకు రూ.48.60 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయి. వీటిలో వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, వాణిజ్య భవనాలు ఉన్నాయి.ఇక అతని పేరుతో మొత్తం అప్పులు రూ.4.14 కోట్లు. అఫిడవిట్ ప్రకారం, 2022 23లో అతని ఆదాయం రూ. 71.17 కోట్లు, 2021 22లో రూ. 1.52 కోట్లుగా ఉంది. రాజ్‌గోపాల్ రెడ్డి అఫిడవిట్‌లో రాష్ట్ర ప్రభుత్వాలు, సింగరేణి కాలరీస్, సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ , ఇతర రాష్ట్రాల నుండి సుషీ ఇన్‌ఫ్రా, మైనింగ్ లిమిటెడ్ పేరుతో పొందిన 16 కాంట్రాక్టుల వివరాలను కూడా

మిగతా 2 లో

## ప్రభుత్వాసుపత్రిలో దారుణం..

- **తల్లి పాత్రిళ్లలో పాప మాయం**

**టీ మీడియా, నవంబర్ 10, విజయవాడ :**

విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రిలో దారుణం చోటు చేసుకుంది. తల్లీపిల్లల హాస్పిటల్‌లో ఓ మహిళ కవలలకు జన్మనిచ్చింది. ఈ నెల 8వ తేదీన కంకిపాడు నుంచి డెలివరీ నిమిత్తం గంగా భవాని అనే మహిళ హాస్పిటల్‌లో చేరింది. అదే రోజు కాన్పు అయ్యింది. ఇద్దరు బిడ్డలకు జన్మనిచ్చింది. ఒక బిడ్డకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఐసీయూలో.. మరో బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉందని తల్లి వద్ద ంచారు. శుక్రవారం పాలు పట్టించాలని తల్లి వద్ద ఉన్న పాపను ఆసుపత్రి సిబ్బంది తీసుకెళ్లింది. కొద్దిసేపటికే బేబీ చనిపోయాయిందంటూ తల్లిదండ్రులకు సిబ్బంది సమాచారం ఇచ్చింది. మఅతి చెందిన బేబీ .. తమ బేబి కాదంటూ తల్లిదండ్రులు చెబుతున్నారు. చనిపోయిందని చెప్పిన బేబీకి రెండు టాగ్స్ ఉండడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. పుట్టింది అమ్మాయి అని.. అయితే చనిపోయిన పాప బాడీకి అబ్బాయి ట్యాగ్ ఉందని చెబుతున్నారు. పాప వద్ద సిబ్బంది ఫింగర్ ప్రింట్ తీసుకోలేదని.. కానీ చనిపోయిన బేబికి ఫింగర్ ప్రింట్ తీసుకున్నట్టు ఆనవాళ్లున్నాయని చెబుతున్నారు. సిబ్బంది ప్రవర్తన పట్ల కూడా కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## కేసీఆర్ నియోజకవర్గం ఫస్ట్

### రేవంత్ రెడ్డి నియోజకవర్గం లాస్ట్

- **రెండు ఇంట్రెస్టింగ్ నియోజకవర్గాలు**

**టీ మీడియా, నవంబర్ 10, హైదరాబాద్:**

తెలంగాణలో ప్రస్తుతం ఎన్నికల హీట్ పెరుగుతోంది. ఎలక్షన్స్ దగ్గర పడుతోన్న క్రమంలో పార్టీలు ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. ఇక నామినేషన్ల పర్వం శనివారంతో పూర్తయింది. చివరి క్షణం వరకు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో ఓ ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది.తెలంగాణలో ఎన్నికలు ఇప్పుడు ఆ ఇద్దరి చుట్టే తిరుగుతున్నాయి. సీఎం కేసీఆర్ వర్సెస్ రేవంత్ రెడ్డిగా ఈ అసెంబ్లీ ఎన్నికలు నడుస్తున్నాయి. తీరా నామినేషన్ల వ్యవహారంలో కూడా ఆ రెండు నియోజకవర్గాల్లో చాలా ఇంట్రెస్టింగ్ గా మారాయి. నామినేషన్ల విషయంలో అటు సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వెల్, మరోవైపు రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండగల్ రాష్ట్రం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇంతకీ ఈ విషయం ఏంటో తెలియాలంటే ఈ స్టోరీలోకి వెళ్లాల్సిందే..రాష్ట్రంలో నామినేషన్ల సమయం గడిచిపోయింది. ఏ నియోజకవర్గంలో ఏ అభ్యర్థి బరిలో నిలవనున్నాడనే దానిపై క్లారిటీ వచ్చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3500 వరకు నామినేషన్లు దాఖలైనట్లు తెలుస్తోంది. వీటిలో 96 నామినేషన్లతో గజ్వెల్ మొదటి స్థానంలో నిలవగా, కొడంగల్ 12 నామినేషన్లతో చివరి స్థానంలో నిలిచింది. ఇప్పుడీ అంశం ఆసక్తికరంగా మారింది. ఇలా నామినేషన్ల వ్యవహారంలో కూడా మళ్లీ ఆ ఇద్దరి ఆగ్రనేతల నియోజకవర్గాలే ఆసక్తిగా మారాయి.

గజ్వెల్‌లో ఉన్న భూనిర్వాసితులు, రాష్ట్రవ్యాప్తంగా పోటీ చేస్తున్న చిన్నాచితకా పార్టీలు, భారీ సంఖ్యలో ఇండిపెండెంట్‌లు నామినేషన్లు వేశారు. సీఎం కేసీఆర్‌తో పోటీపడ్డాం అని చెప్పుకోవడానికి సగానికి పైగా అక్కడ నామినేషన్లు వేశారు. దీంతో రాష్ట్రంలో ఎక్కడ లేనన్ని 96 నామినేషన్లు అక్కడ దాఖలు అయ్యాయి. ఒకవేళ చివరి వరకు ఎవరూ నామినేషన్లు విత్ డ్రా చేసుకోకపోతే.. 5 ఈవీఎమ్ మిషన్లు అవసరపడతాయి.ఇక కొడంగల్ విషయానికొస్తే మొదటి నుంచి కొంత వెనుకబడి ఉన్న ప్రాంతం%కొ% తెలంగాణ సరిహద్దులు, కర్ణాటకకు ఆనుకుని ఉన్న నియోజకవర్గం.. దీంతో కామన్ గానే రాజకీయ చైతన్యం తక్కువగా ఉంటుంది. 2018 లో కూడా ఇక్కడ పదిలోపే నామినేషన్లు దాఖలు అయ్యాయి.

## అత్యంత ధనిక ఎమ్మెల్యే అభ్యర్థులు

(మొదటి పేజీ తరువాయి)

సమర్పించారు. 2018లో మునుగోడు నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నప్పుడు రూ. 314 కోట్ల ఆస్తులను ప్రకటించినప్పటి నుంచి ఆయన నికర విలువ 45 శాతానికి పైగా పెరిగింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సమయంలో రూ. 66 కోట్ల ఆస్తులు ప్రకటించారు. 2009 నుండి 2014 వరకు లోక్‌సభ సభ్యునిగా ఉన్న రాజ్‌గోపాల్ రెడ్డి 2018లో కాంగ్రెస్ టిక్కెట్‌పై ముంగోడు నుండి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. అనంతరం మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో, ఆయన కాంగ్రెస్‌ను విడిచిపెట్టి, అసెంబ్లీకి రాజీనామా చేసి, గత సంవత్సరం బీజేపీలో చేరారు. అయితే గతేడాది నవంబర్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోదరుడైన రాజ్‌గోపాల్‌రెడ్డి కొద్దిరోజుల క్రితం మళ్లీ కాంగ్రెస్‌లో చేరి మునుగోడుకు టికెట్ దక్కించుకున్నారు.

ఇదిలావుంటే, అధికార పార్టీ భారత రాష్ట్ర సమితి (%దీ=ూ%)కు చెందిన పైళ్ల శేఖర్ రెడ్డి రాష్ట్రంలోనే అత్యంత ధనవంతుడిగా రెండో స్థానంలో నిలిచారు. భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తిరిగి బరిలోకి దిగిన ఆయన ఆస్తులు విలువ రూ. 227 కోట్లు. శేఖర్ రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. మరోక %దీ=ూ% ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి, మెదక్ %వీూ% దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి %ఖ%. ప్రభాకర్ రెడ్డితో భాగస్వాములుగా ఉన్నారు. ఇక దుబ్బాక నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన ప్రభాకర్ రెడ్డి ఆస్తులు రూ. 197 కోట్లు. ఇటీవల కత్తిపోట్లతో కోలుకున్న ఆయన గురువారం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేసేందుకు వీల్ చైర్‌లో రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వచ్చారు. ఆయనకు రూ. 7.24 కోట్ల చరాస్తులు ఉండగా, ఆయన భార్య మంజులతకు రూ. 9.41 కోట్ల చరాస్తులు ఉన్నాయి. ప్రభాకర్ రెడ్డికి రూ. 84.63 కోట్ల స్థిరాస్తులు ఉండగా, ఆయన భార్య విలువ రూ. 96 కోట్లు. 2022 23లో, అతని ఆదాయం రూ. 2.91 కోట్లు కాగా, అంతకుముందు సంవత్సరంలో ఇది రూ. 3.16 కోట్లు. ఈ జంట మొత్తం రూ. 12.79 కోట్ల రుణాలను కలిగి ఉన్నారు. నాగర్‌కర్నూల్ నుంచి పోటీ చేస్తున్న జనార్దన్‌రెడ్డి తన ఆస్తులు రూ. 112 కోట్లుగా ప్రకటించారు.

## పాలస్తీనాకు మద్దతు

- మీడియా కార్మికుల ప్రదర్శన

**టీ మీడియా, నవంబర్ 9, వాషింగ్టన్ :**

పాలస్తీనాకు మద్దతుగా వందలాది మంది మీడియా కార్మికులు గురువారం న్యూయార్క్ టైమ్స్ సంస్థ ఎదుట బైఠాయించారు. గాజాలో తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ –హమాస్ యుద్ధానికి సంబంధించిన వార్తల కవరేజీలో మీడియా ఇజ్రాయిల్ పట్ల పక్షపాతం చూపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాన్‌హట్టన్‌లోని ప్రధాన కార్యాలయం ఎదుట 'రైటర్స్ బ్లాక్ ' వందలాది మంది మీడియా వర్కర్స్ నిరసన ప్రదర్శన చేపట్టారు. గంటకు పైగా ఈ ప్రదర్శన కొనసాగింది. గాజాలో ఇజ్రాయిల్ కొనసాగించిన నరమేధంలో మరణించిన 36 మంది జర్నలిస్టులతో పాటు వేలాది మంది పేర్లను ప్రచురించిన పేజీలను ప్రదర్శించారు. ఆ ప్రచురణను ఖండిస్తూ.. ఆ పేర్లను చదివి వినిపించారు. 'ది న్యూయార్క్ వార్ క్రైమ్స్' లో ప్రచురించే కథనాలు ఇజ్రాయిల్ నరమేధానికి మద్దతు తెలుపుతున్నట్లు ఉన్నాయని మండిపడ్డారు. ఆ కథనాలు ప్రచురించిన పేపర్స్‌ను చింపివేశారు. బహిరంగంగా కాల్పుల విరమణకు మద్దతు పలకాలని ఎడిటోరియల్ బోర్డ్‌ని డిమాండ్ చేశారు. గతవారం కూడా వందలాది మంది గ్రాండ్ సెంట్రల్ టెర్మినల్‌లో ఇప్పుడే కాల్పుల విరమణ అని రాసి వున్న బ్యానర్‌లను ప్రదర్శించిన సంగతి తెలిసిందే. మంగళవారం కార్యకర్తలు జెవిష్ వాయిస్ ఫర్ పీస్ బృందంతో స్టాట్యూ ఆఫ్ లిబర్టీ ఎదుట ప్రదర్శన చేపట్టారు. ఇజ్రాయిల్ అమానవీయ దాడితో గాజాలో ఇప్పటివరకు 10,800 మందికి పైగా మరణించగా, వేలాది గాయపడినట్లు పాలస్తీనా వైద్య శాఖ ప్రకటించింది.

## సునితా లక్ష్మారెడ్డి గెలిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి

- మంత్రి హరీశ్ రావు

**టీ మీడియా, నవంబర్ 10, మెదక్ :**

సునితా లక్ష్మారెడ్డి గెలిస్తే నర్సాపూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే నామినేషన్ ర్యాలీలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ%ా% సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాడన్నారు. సంక్షేమ ఫలాలను అందరికి పంచేలా చూశారన్నారు. పదకొండు సార్లు కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే ఏమీ చేయలేదన్నారు. బీజేపీకి ఒకటే సీటు వచ్చిందని ఈసారి డిపాజిట్లు కూడా రావన్నారు. బీజేపీ డక్ అవుట్, కాంగ్రెస్ రన్ అవుట్ అయితే, కేసీఆర్ సెంచరీ కొడుతారన్నారు. రాష్ట్రంలో 28 లక్షల మోటర్లు ఉన్న రైతులు కేసీఆర్‌ను కాదని ఇతర పార్టీలకు ఓటు వేయరన్నారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసే అభ్యర్థి ఇప్పటి వరకు సర్పంచి కూడా కాలేదు. రాష్ట్రంలో గెలిచే పార్టీ బీఆర్ఎస్ పార్టీ, ఇతర పార్టీలు గెలిస్తే అభివృద్ధి జరగదన్నారు. సునీతా రెడ్డిని ఎమ్మెల్యే చేయండి, మదన్ రెడ్డిని ఎంపీ చేసే బాధ్యత నాది అని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హిందువుల మద్దతు కోరని కాంగ్రెస్

- ఆధ్యాత్మిక వేత్త ఆచార్య ప్రమోద్ ఫైర్

**టీ మీడియా, నవంబర్ 10, భోపాల్ :**

కాంగ్రెస్ హిందూ వ్యతిరేక వైఖరిని అవలంభిస్తోందని ఆ పార్టీ నేత, ఆధ్యాత్మికవేత్త ఆచార్య ప్రమోద్ కృష్ణమ్ మండిపడ్డారు. మధ్యప్రదేశ్‌లో పార్టీ ప్రచారానికి తనను పిలవకపోవడానికి ఇది ఓ కారణం అయిఉంటుందని తాను భావిస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ నిర్ణయంతో తాను నిరాశకు లోనుకాలేదని, వారికి హిందువుల మద్దతు అవసరం లేకపోవచ్చని, హిందూ గురువును స్టార్ క్యాంపెయినర్‌గా నియమించడంలో వారికి ఇబ్బందులు ఉన్నాయేమోనని పేర్కొన్నారు. ఏమైనా ఇది పార్టీ నిర్ణయమని, కాంగ్రెస్‌లో శ్రీరాముడిని ద్వేషించే నేతలు కొందరున్నారని తాను భావిస్తున్నానని ఆచార్య ప్రమోద్ అన్నారు. విపక్ష ఇండియా కూటమిపైనా ఆచార్య పలు సందేహాలు లేవనెత్తారు. ప్రధాని మోదీని ఓడించి బీజేపీ ప్రభుత్వాన్ని కుప్పకూల్చడమే ఇండియా కూటమి లక్ష్యమని, అయితే వారు మోదీని ద్వేషించే క్రమంలో వారు భారత్‌ను ద్వేషిస్తున్నారనే విషయం మరిచిపోవడం విచారకరమని వ్యాఖ్యానించారు. ప్రధాని పార్లమెంట్ భవనాన్ని ప్రారంభిస్తే విపక్ష నేతలు విమర్శించారని, వందే భారత్‌ను పట్టాలెక్కిస్తే విమర్శించారని గుర్తుచేశారు. ప్రధాని మోదీని విమర్శించడాన్ని ఎవరూ తప్పుపట్టరని, కానీ ఆయనను పనికట్టుకుని ద్వేషించడం సరైంది కాదని అన్నారు. విపక్షం అన్నింటినీ విస్మరించి గందరగోళంగా తయారైందని ఆచార్య ఆక్షేపించారు. రాష్ట్ర అసెంబ్లీలో మహిళలను ఉద్దేశించి బిహార్ సీఎం నితీష్ కుమార్ చేసిన వ్యాఖ్యలను విపక్ష కూటమిలో ఎవరూ విమర్శించలేదని అన్నారు.

# కోఆర్డినేషన్ కమిటీల ఊసేలేదు

- స్టార్ క్యాంపెనర్ల తీరుపై అధిష్టానం సీరియస్
- ప్రచారంపై దృష్టి పెట్టాలని సూచన

**టీ మీడియా, నవంబర్ 9, హైదరాబాద్ :**

కాంగ్రెస్ నేతల ప్రచారం విడివిడిగా బాగానే ఉంది. కానీ కలిసి ఎక్కడా కనిపించడంలేదు. ఒకరి కోసం ఒకరు పనిచేయడం కనిపించడంలేదు. స్టార్ క్యాంపెనర్లు పత్తా లేరు. కోఆర్డినేషన్ కమిటీల ఊసేలేదు. ఈ విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ అధిష్టానం.. పెద్ద క్లాసే తీసుకుంది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గాంధీ భవన్‌కు వచ్చి మరీ పరిస్థితిని సమీక్షించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఫైట్ ప్రధానంగా బీఆర్ఎస్ %జం% కాంగ్రెస్ అన్నట్లుగా మారింది. రెండు పార్టీలు ప్రచారంలో దూసుకుపోతున్నాయి. బీఆర్ఎస్ నుంచి సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. కేసీఆర్ అయితే.. ప్రతీరోజు రెండు మూడు నియోజకవర్గాల్లో మీటింగ్స్ పెడుతున్నారు. కేటీఆర్, హరీష్ రావు కూడా అటు అన్ని నియోజకవర్గాలను చుట్టేస్తున్నారు. ఇటు పార్టీలో సర్దుబాట్లు చేసుకుంటూ వెళ్తున్నారు. కానీ కాంగ్రెస్‌లో ఆ జోష్ కనిపించడం లేదన్నది అధిష్టాన పెద్దలే చెబుతున్నారు. గురువారం ఇందిరా భవన్‌లో ప్రధాన నేతలతో కేసీ వేణుగోపాల్ వర్చువల్ మీటింగ్ నిర్వహించారు. ప్రచారం ఎలా జరుగుతోందని.. ఎక్కడెక్కడ ఎంతెంత సేపు నిర్వహిస్తున్నారో ఆరా తీశారు. కానీ ఆయన ప్రచారం జరుగుతున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్చువల్ మీటింగ్‌లోనే కేసీ వేణుగోపాల్ నేతలపై ఫైర్ అయ్యారు. ప్రచారం అనుకున్న స్థాయిలో లేదని నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యాక్టివ్‌గా ప్రచారం నిర్వహించాలని సూచించారు. కొందరు పెద్ద నేతలు తమ నియోజకవర్గం వరకే పరిమితం అవుతున్నారని.. ఆయా జిల్లాల్లోనే మిగితా నియోజకవర్గాల్లోనూ ప్రచారం చేయాలన్నారు. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి తప్ప.. మిగిలిన పెద్ద నేతలెవరూ.. గ్రౌండ్ లెవెల్‌లో యాక్టివ్‌గా లేకపోవడాన్ని తప్పుబట్టారు. మీడియాకి ఇంటర్వ్యూలు ఇచ్చే శ్రద్ధ ప్రచారంలోనూ పెట్టాలని గట్టిగానే క్లాస్ తీసుకున్నారు కేసీ వేణుగోపాల్.

ఇక త్వరలోనే జరగబోయే బహిరంగ సభలపైనా ఆరాతీశారు. కాంగ్రెస్ ముఖ్యనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సభల నిర్వహణ ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. సభలకు భారీగా జనసమీకరణ చేపట్టాలని సూచించారు. ఇక స్టార్ క్యాంపెయినర్స్, కోఆర్డినేషన్ టీమ్‌లను.. త్వరగా ఏర్పాటు చేయాలని కేసీ వేణుగోపాల్ నేతలను డైరెక్ట్ చేశారు. ఇక తెలంగాణ ఎన్నికలపై వర్చువల్ మీటింగ్‌లో మాట్లాడారు కేసీ వేణుగోపాల్. కర్నాటక వాతావరణమే తెలంగాణలో కనిపిస్తోందన్నారాయన. 70 స్థానాల్లో విజయం సాధించి, కాంగ్రెస్ అధికారంలోకి రాబోతోందని, పార్టీలో ఎలాంటి గ్రూప్‌లు ఉండొద్దని, అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. అంతేకాదు, టికెట్లు రానివారికి బుజ్జగింపులు కొనసాగాయి. కొందరు నేతలను ఆయన ఫోన్ చేసి పిలిపించుకున్నారు. టికెట్లు రాని నూతి శ్రీకాంత్, శివసేనారెడ్డి, బల్మూరి వెంకట్‌లను కలిసి.. అధికారంలోకి వస్తే సముచిత స్థానం కల్పిస్తామన్నారాయన. ఇక నాలుగో లిస్టుపైనా కసరత్తుచేసి, చివరికి ఒక అభ్యర్థిని మారుస్తూ, మొత్తం ఐదు పేర్లను ప్రకటించారు.

# బీఆర్ఎస్ టు బీఎస్పీ వయా కాంగ్రెస్

- నామినేషన్ వేసిన మధు

**టీ మీడియా, నవంబర్ 10, పటాన్ చెరు :**

రాజకీయాలు హాట్ హాట్‌గా మారాయి. గతంలో విడుదల చేసిన జాబితాలో కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించి.. చివరకు బీఫామ్ ఇవ్వకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు నీలం మధు ముదిరాజ్. ఇప్పుడు బీఎస్పీ కండువా కప్పుకున్నారు. బీఆర్ఎస్‌లో ఉన్న ఆయన ఈసారి అక్కడ టిక్కెట్ ఆశించి భంగపడ్డారు. కేసీఆర్ పార్టీని వీడి టికెట్ వస్తుందన్న ఆశతో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ లిస్ట్‌లో మధు పేరు రావడంతో పటాన్ చెరువు కాంగ్రెస్ నాయకుల మధ్య విభేదాలు తలెత్తాయి. ఇదే పార్టీలో టిక్కెట్ కోసం ముందు నుంచీ ప్రయత్నిస్తున్నారు కాటా శ్రీనివాస్ గౌడ్. గతంలో కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఇంటి వద్దకు చేరిన ఆయన అనుచరులు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మాజీ మంత్రి దామోదర రాజనర్సింహ అండ కూడా కాటా శ్రీనివాస్‌కే ఉన్నాయి. నీలం మధుకి టిక్కెట్ ఇవ్వడాన్ని జగ్గారెడ్డి కూడా వ్యతిరేకించారు. దాంతో కాంగ్రెస్ లిస్టులో పేరున్నప్పటికీ గాంధీభవన్‌లో మాత్రం మధుకు బీఫామ్ ఇవ్వలేదు. చాలా కాలంగా జాప్యం చేస్తున్నారు. ఈక్రమంలోనే బీజేపీ పెద్దలు కూడా నీలం మధును కలుసుకున్నారు. ఆయనతో మంతనాలు జరిపి తమ పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. కానీ పటాన్‌చెరు నుంచి ఎట్టి పరిస్థితుల్లో ఎమ్మెల్యేగా కంటెస్ట్ చేయాలనుకున్నారు మధు. చివరకు బహుజన్ సమాజ్ వాదీ పార్టీ బీఫామ్ ఇవ్వడానికి అంగీకరించడంతో ఆ పార్టీలో చేరిపోయారు. వారం, పది రోజులుగా పటాన్ చెరు రాజకీయం అంతా నీలం మధు ముదిరాజ్ చుట్టూనే తిరిగింది. కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడైన మధు.. పటాన్ చెరువు టిక్కెట్ ఆశించాడు. అందుకు బీఆర్ఎస్ అధిష్టానం అంగీకరించలేదు. దాంతో ఇండిపెండెంట్‌గా అయినా ఎన్నికల బరిలో నిలబడాలని నిర్ణయించుకున్నారు. సరిగ్గా ఇదే సమయంలో కాంగ్రెస్ నుంచి పిలుపు రావడంతో పార్టీ మారిపోయారు. జాబితాలో పేరు వచ్చి బీఫామ్ ఇవ్వకపోవడంతో లాంటి పరిస్థితులకు కారణమైంది.

## బీహార్ సీఎం తినే ఆహారంలో ఎవరో విషం కలిపినట్టున్నారు

- జితన్‌రామ్ మాంఝీ

**టీ మీడియా, నవంబర్ 10, పాట్నా:**

బీహార్ సీఎం నితీశ్‌కుమార్ అసెంబ్లీ సాక్షిగా తనపై విమర్శలు చేయడాన్ని హిందుస్థానీ అవామ్ మోర్చా పార్టీ అధ్యక్షుడు జితన్‌రామ్ మాంఝీ తప్పుపట్టారు. నితీశ్‌కుమార్ సీఎం కుర్చీని లాక్కునేందుకు ఆయన తినే ఆహారంలో ఎవరో విషం కలిపి ఉంటారని, ఆ విషం ప్రభావంతోనే ఆయన రెండు రోజుల క్రితం మహిళల గురించి, నిన్న నా గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని మాంఝీ ఎద్దేవా చేశారు. బీహార్ అసెంబ్లీలో కుల గణన నివేదికపై చర్చ సందర్భంగా జితన్‌రామ్ మాంఝీ మాట్లాడుతూ.. కుల గణన సర్వే సక్రమంగా జరిగనట్లు తనకు అనిపించడంలేదని, ఒకవేళ ఆ డేటాలో తప్పులు ఉంటే సంక్షేమ ఫలాలు అసలైన లబ్ధి దారులకు దక్కకుండా పోతాయని అన్నారు. దీనిపై నితీశ్ స్పందిస్తూ.. '2014లో మాంఝీని మేం సీఎంను చేశాం. నేను సీఎంగా పనిచేసిన అని ఆయన ఎప్పుడూ చెప్పుకుంటూ ఉంటారు. అసలు ఆయనకు ఏమైనా పరిజ్ఞానం ఉన్నదా..? ఏదో నా మూర?త్వం వల్ల నాడు సీఎం అయ్యారు' అని వ్యాఖ్యానించారు. అదేవిధంగా బీహార్‌లో నిర్వహించిన కులగణనకు సంబంధించిన నివేదికను మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సందర్భంగా కూడా నితీశ్‌కుమార్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'భర్తల చర్యల వల్ల జననాలు పెరిగాయి. అయితే చదువుకున్న మహిళలకు తమ భర్తలను ఎలా నియంత్రించాలో తెలుసు. అందుకే ఇప్పుడు జననాల రేటు తగ్గుతూ వస్తున్నది' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు, మహిళా సంఘాలు భగ్గుమనడంతో నితీశ్ క్షమాపణలు చెప్పారు. ఈ పరిణామాల నేపథ్యంలో మాంఝీ ఇవాళ నితీశ్ మానసిక స్థితిని ఎగతాళి చేశారు.

## పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభం

**టీ మీడియా, నవంబర్ 10, తిరుపతి :**

తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ధ్వజారోహణంతో శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, అభిషేకం అనంతరం నాలుగుమాడ వీధుల్లో తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ గరుత్మంతుని చిత్రం ఉన్న ధ్వజ పటాన్ని ఆరోహణం చేశారు. టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి దంపతులు, జేఈవో సదా భార్గవి, జేఈవో వీరబ్రహ్మం దంపతులు, డిప్యూటీ ఈవో గోవింద రాజన్, విజివో బాలిరెడ్డి, పాంచరాత్ర ఆగమ సలహాదారు శ్రీనివాసా చార్యులు, కంకణ భట్టార్ మణికంఠ స్వామి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో ఎవి ధర్మారెడ్డి శుక్రవారపు తోటలో ఉద్యాన విభాగం ఏర్పాటు చేసిన పుష్పప్రదర్శన, శిల్పకళాశాలలో ఏర్పాటు చేసిన శిల్పకళా ప్రదర్శన, తిరుమల –తిరుపతి స్పిరుచువల్ సొసైటీ ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన శాలను ప్రారంభించారు. ఈవో ఎవి ధర్మారెడ్డి మాట్లాడుతూ ధ్వజారోహణంతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయని , మాడ వీధుల్లో ఉండే ప్రతి భక్తుడికి వాహన సేవ దర్శనం కల్పిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులందరికీ మూల మూర్తి దర్శనం చేయించేలా చర్యలు తీసుకున్నామన్నారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన గజ వాహన సేవ, పంచమీ తీర్థం కు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారని, ఇందుకు అవసరమైన భద్రత, ఇతర ఏర్పాట్లకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ సందర్భంగా చెన్నై కు చెందిన హిందూ మహాసభ ట్రస్ట్ చైర్మన్ డి ఎల్ వసంత కుమార్ తదితరులు అమ్మవారికి ఆరు గొడుగులను కానుకగా అందించారు.

## హిందుత్వ పరిరక్షణకు మార్గదర్శకాలు ఇవ్వాలంటూ పిటిషన్

- తిరస్కరించిన సుప్రీంకోర్టు

**టీ మీడియా, నవంబర్ 10, న్యూఢిల్లీ :**

భారతదేశంలో హిందుత్వ పరిరక్షణకు మార్గదర్శకాలను కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ విషయంలో సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోర్టును కోరారు. అయితే, పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఈ పిటిషన్‌కు సంబంధించి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ నేతృత్వంలోని ధర్మాసనం స్పందిస్తూ కొందరు ఇస్లాంను రక్షించాలని, మరికొందరు క్రైస్తవాన్ని రక్షించాలని చెబుతారని పేర్కొంది. ధర్మాసనంలో జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్‌తో పాటు జస్టిస్ సుధాన్‌షు ధులియా, జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా సైతం ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తి ఈ పిటిషన్ దాఖలు చేశారు. 'మీరు ఏదైనా చేసినా.. ఎవరూ అడ్డుకోరు. కానీ అందరూ చేయాలని చెప్పలేం' అని పిటిషనర్‌కు సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేస్తూ.. పిటిషన్‌ను తిరస్కరించింది.



## గవర్నర్ బిల్లులను ఆమోదించకపోవడం ఆందోళనకరమైన అంశం

- సుప్రీంకోర్టు

**టీ మీడియా, నవంబర్ 10, చెన్నై :**

తమిళనాడు బిల్లులను ఆమోదించడంలో గవర్నర్ జాప్యం తీవ్ర ఆందోళన కలిగించే అంశమని సుప్రీంకోర్టు శుక్రవారం వ్యాఖ్యానించింది. ప్రాసిక్యూషన్ కోసం అభ్యర్థనలను మంజూరు చేయడం, ఖైదీల ముందస్తు విడుదల కోసం అభ్యర్థనలు, తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో ఖాళీలను భర్తీ చేయడం వంటి బిల్లులను ఆమోదించకుండా జాప్యం చేయడాన్ని తీవ్రంగా పరిగణించిస్తున్నట్లు పేర్కొంది. హోం మంత్రిత్వ శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అలాగే అటార్నీ జనరల్ లేదా సొలిసిటర్ జనరల్ విచారణ సమయానికి కోర్టులో హాజరుకావాలని ఆదేశించింది. ఈ పిటిషన్‌పై విచారణను వచ్చే సోమవారానికి జాబితా చేస్తున్నట్లు ప్రకటించింది. రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్. రవికి వ్యతిరేకంగా అక్టోబర్ 30న తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. గవర్నర్ రాజకీయ ప్రత్యర్థిగా వ్యవహరిస్తున్నారని, పౌరుల ఆదేశాలను తుంగలో తొక్కుతున్నారని పిటిషన్‌లో పేర్కొంది.